క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. శ్యామల గార్డెన్, నాగరాజు టెంపుల్, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 17న కేయూలోని పరిపాలనా భవనం ప్రాంగణంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం.. జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీచేశారు.

నేడు విశ్వకర్మ మహాయజ్ఞం

మడికొండ: మడికొండలో విశ్వకర్మ మహాయజ్ఞాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మడికొండ శ్రీజగత్ మహామునీశ్వర విశ్వకర్మ సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కడార్ల పూర్ణచందర్ మాట్లాడుతూ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న విశ్వకర్మ సంఘం భవనంలో జరగనున్న యజ్ఞంలో విశ్వకర్మలందరు పాల్గొని విజయవంతం చేయలని కోరారు.

స్వాతంత్య్ర సమరయోధుడు గోవింద స్వామి మృతి


గోవింద స్వామి (ఫైల్)

వరంగల్ చౌరస్తా: స్వాతంత్య్ర సమరయోధుడు, వరంగల్ గోవిందరాజుల గుట్ట దేవస్థానం ధర్మకర్త, రాష్ట్ర ప్రభుత్వ సన్మాన గ్రహీత, రిటైర్డ్ టీచర్ వరయోగుల గోవింద స్వామి మంగళవారం కన్నుమూశారు. గోవిందరాజుల గుట్టకు చెందిన ఆయన మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు.

ఐక్యంగా ముందుకు సాగాలి




హన్మకొండ చౌరస్తా: కార్పొరేట్ శక్తులు తమ వృత్తిని దెబ్బతీయాలని చూస్తున్న తరుణంలో తామంతా కలిసికట్టుగా ఒకేతాటిపైకి వచ్చి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంఘం హనుమకొండ చౌరస్తా కమిటీ అధ్యక్షుడు సింగారపు శ్యామ్ సూచించారు. ప్రపంచ బార్బర్స్ డే సందర్భంగా హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల ఏళ్ల చరిత్ర కలిగిన గౌరవప్రదమైన నాయీ బ్రాహ్మణ వృత్తిలో తామంతా కొనసాగుతున్నందుకు గర్వించాలన్నారు. మోడ్రన్ బ్యూటీపార్లర్ల పేరుతో కులాలకు అతీతంగా తమ వృత్తిలో అడుగుపెడుతున్న కార్పొరేట్ వ్యవస్థలకు భయపడొద్దని సూచించారు. సమావేశంలో సంఘం బాధ్యులు సుదర్శన్, ప్రభాకర్, ఐలయ్య, గురుమూర్తి, రాజేంద్రప్రసాద్, యాదగిరి, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

రామన్నపేట: మద్యం మత్తు లారీ నడుతూ ఓ లారీ డ్రైవర్ డివైడర్‌ను ఢీకొన్న ఘటన మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ గొల్లపూడికి చెందిన లారీ డ్రైవర్ వరగని దాసు.. మద్యం మత్తులో లారీ నడుపుకుంటూ ఆటోనగర్ నుంచి ఎంజీఎం సర్కిల్ వైపు అతివేగంగా వెళ్తూ అన్‌లిమిటెడ్ షాప్ ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టగా డివైడర్ సుమారు మూడు మీటర్ల మేర ధ్వంసమైంది. జీడబ్ల్యూఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ గనిపాక వెంటేశ్వర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ దాసుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

బొడ్రాయి వార్షికోత్సవం



వరంగల్ అర్బన్: వరంగల్ 27వ డివిజన్‌లో బొడ్రాయి 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో చింతాకుల సునీల్, బాషపాక సదానందం, మీసాల ప్రకాశ్, జారతి రమేష్, రాజ్ కుమార్, ఇప్ప ఆదినారాయణ, యాట సత్యనారాయణ, జారితి శ్రీనివాస్, కట్కూరి చారిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నైకి తరలిన నాయకులు

కాజీపేట రూరల్: చెన్నైలో ఈ నెల 17, 18వ తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) 60 ఏజీఎం 2వ నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డిజిటలైజేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ ఇండియన్ రైల్వేస్‌కు కాజీపేట జంక్షన్ నుంచి రైల్వే ఏఐఆర్ఆర్ఎఫ్ పెన్షనర్స్ నాయకులు మంగళవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో చెన్నైకి తరలివెళ్లారు. కాజీపేట ఏఐఆర్ఆర్ఎఫ్ ప్రెసిడెంట్ కందుల సంగమయ్య, జమ్మికుంట బ్రాంచ్ అధ్యక్షుడు డి.రాజేశ్వర్‌రావు తదితరులు తరలివెళ్లారు.

వినియోగదారులకు సువర్ణావకాశం



- రాయితీపై సోలార్ ప్లాంట్లు
- కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం
- టీజీ ఎన్పీడీసీఎల్‌లో 42.53 లక్షల గృహ వినియోగదారులు
- ఇప్పటి వరకు ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న వారు 11,955 మంది



హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు, నివాస గృహాల్లో సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థలు తమ పరిధిలో ఇళ్ల పైకప్పుపై సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించేందుకు కృషి చేస్తున్నాయి. విద్యుత్ వినియోగదారులు సౌరశక్తిని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సహాయానికి విద్యుత్ పంపిణీ సంస్థలు తోడ్పాటునందిస్తాయి. నెట్ మీటర్ల ఏర్పాటు, ఇన్‌స్టలేషన్‌ను సులభతరం చేశాయి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిల్‌లో మొత్తం గృహ వినియోగదారులు 42.53 లక్షల మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 11,955 మంది సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని 100.9 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో 6,003 మంది విద్యుత్ వినియోగదారులు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుని 22.2 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. జూలై మాసంలో 3,931 మందికి జీరో బిల్లు వచ్చింది. విద్యుత్ బిల్లుల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి (డిస్కంలకు) విక్రయించి ఆదాయం పొందవచ్చు. సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడడాన్ని తగ్గించడం, పర్యావరణ హితమైన విద్యుత్‌ను ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

రాయితీ ఇలా..

ఈపథకంలో ఒక కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్ల సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లు, ఆపై ఎంత సామర్థ్యంతో సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకున్నా.. రూ.78 వేల రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతమున్న ధరల ప్రకారం ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సోలార్ యూనిట్ ఏర్పాటుకు దాదాపు రూ.85,550 అవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ అందిస్తుంది. 2 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.1.60 లక్షలు ఖర్చు అవుతుంది. 3 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.2,10 లక్షలు ఖర్చు అవుతుంది. మూడు కిలో వాట్ల పైగా సోలార్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 వేల రాయితీని అందిస్తోంది. 5 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.3.15 లక్షలు అవుతుంది. విద్యుత్ కనెక్షన్ కలిగి ఉన్న ప్రతీ వినియోగదారుడు ఈ సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. పై కప్పు సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉండాలి. ఒక కిలోవాట్ సోలార్ యూనిట్ ఏర్పాటు ద్వారా నాలుగున్నర యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మూడు కిలోవాట్ల సోలార్ ప్యానళ్ల ద్వారా 15 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మిగులు విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించడం ద్వారా యూనిట్‌కు రూ.5.25 చొప్పున ఆదాయాన్ని పొందవచ్చు.

సంవత్సరం వారీగా వివరాలు...

సంవత్సరం	సర్వీస్‌లు	కెపాసిటీ కిలో వాట్లు	ఉత్పత్తి మెగావాట్లు
2014-15	11	397	0.40
2015-16	21	352	0.35
2016-17	43	427	0.43
2017-18	70	773	0.77
2018-19	147	3,797	3.80
2019-20	306	7,855	7.86
2020-21	469	5,252	5.25
2021-22	675	5,270	5.27
2022-23	796	6,715	6.72
2023-24	1,769	15,534	15.53
2024-25	4,204	33,682	33.68
2025-26	3,443	20,859	20.85

పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య

2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,165 మంది గృహ వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుని 4.95 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,902 మంది వినియోగదారులు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా 10.4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విద్యుత్ బిల్లుల భారం తప్పించుకునేందుకు వినియోగదారులు క్రమంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి వైపు ఆకర్షితులవుతున్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 11 మంది 397 కిల వాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా 0.40 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా, 2024-25లో 4,204 మంది వినియోగదారులు 33,682 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 33.68 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 3,443 మంది వినియోగదారులు 20,859 కిలో వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా 20.85 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు


డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న మురళీధర్

ఖిలా వరంగల్: త్వరలోనే అర్హులైన పేదలు, జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు తూర్పు నియోజకవర్గంలోని దూపకుంట, దేశాయిపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను మంగళవారం సందర్శించారు. పూర్తి అయిన ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కల సాకారం అయ్యేలా అర్హులైన ప్రతీ ఒక్కరికి డబుల్‌బెడ్రూం ఇల్లు త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని, పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, కొత్తపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు దసరా ఉత్సవాలపై సమీక్ష

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద నేతృత్వంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలపై బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపూరి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వివిధశాఖల అధికారులు హాజరుకానున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని వారు కోరారు.

చరిత్రను వక్రీకరిస్తే పుట్టగతులుండవు


సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

ఖిలా వరంగల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే పుట్టగతులు ఉండవని ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి మాలోతు సాగర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముక్కెర రామస్వామి, రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి గణేపాక ఓదెలు అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా వరంగల్ 41వ డివిజన్ కాశికుంటలో తాటికాయల రత్నం అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐతం నగేష్, బాపు రామస్వామి, పూలమ్మ, మున్నీక్రైసర్ బేగం, సంతోష్, ఆశా బేగం, జమునమ్మ, రాజు, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



ఖిలా వరంగల్: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఫోర్ట్ రోడ్డులోని పీఏసీఎస్ కార్యాలయ గోదాం వద్ద రైతులు యూరియా కోసం మంగళవారం తెల్లవారుజామునే బారులుదీరారు. 400 బస్తాల యూరియాకు క్యూలైన్‌లో సుమారు 500 మంది రైతులు నిరీక్షించారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో సొసైటీ సిబ్బంది యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ప్రధాన రోడ్డు కావడంతో రాకపోకలకు స్థానిక ప్రజలు, రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లా కళాశాలలో బతుకమ్మ వేడుకలు

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం


బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, తదితరులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ న్యాయ కళాశాలలో విద్యార్థినులు సామాజిక బతుకమ్మ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగను వరంగల్ కాకతీయ వంశీయులు మొదలు పెట్టినట్టుగా చరిత్ర చెబుతోందన్నారు. అప్పటి సామాజిక పరిస్థితులకనుగుణంగా బతుకమ్మ పండుగను సామాన్యుల నుంచి ఉన్నతవర్గ స్త్రీలు కూడా జరుపుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రాంతీయ సంస్కృతిలో బతుకమ్మ పండుగనేది ఒక ముఖ్య భూమిక పోషించిందని చెప్పారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితరెడ్డి, సుకుమారి, బి.రామ, అధ్యాపకులు చల్ల శ్రీనివాస్, వేదశ్రీ, సుజాత, పద్మజ, ప్రభాకర్, హరిప్రసాద్, లైబ్రేరియన్, నాన్ టీచింగ్ సభ్యులు పాల్గొన్నారు.

భగీరథ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: భగీరథ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుకూరి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చిలగాని మోహన్, మేకల సునీల్, కార్యదర్శులుగా పెద్దిరెడ్డి, గొరిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా చింతల విశ్వేశ్వర్, గౌరవ అధ్యక్షులుగా మండల భిక్షపతి, పోతరాజు సారంగం, సలహాదారులుగా తిరుపతిరెడ్డి, పాపిశెట్టి కోటిలింగం ఎన్నియ్యారు.

రాష్ట్ర జేఏసీ నేతలకు సన్మానం


జేఏసీ నేతలను సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఉద్యోగ సంఘాల జేఏసీ పోరాట ఫలితంగా ఉద్యోగ సంఘాల గుర్తింపు, జీఓ 185 ద్వారా ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కొరకు ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్‌ను పటిష్టం చేస్తూ విధి విధానాలను రూపొందించుటకు కమిటీ ఏర్పాటుకు ఆదేశించింది. అందుకు కృషి చేసిన రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యాలయంలో హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో మినిస్టీరియల్ విభాగంలో పదోన్నతుల కోసం వినతిపత్రం ఇవ్వగా, వారు సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీప్రసాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, నవీన్, రామాంజనేయులు, త్రివేణి, ఫాతిమా, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

19న లంబాడీల ఆత్మగౌరవ ధర్నా


లంబాడీల ఆత్మగౌరవ నిరసన, ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 19న జరగనున్న లంబాడీల ఆత్మగౌరవ నిరసన ధర్నాను జయప్రదం చేయాలని లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ గ్రేటర్ వరంగల్ శాఖ చైర్మన్ భూక్య మోతీలాల్ నాయక్, కన్వీనర్లు బానోత్ నవీన్ నాయక్, సునావత్ జవహర్ నాయక్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ ఆవరణలో ఆత్మగౌరవ నిరసన ధర్నా వాల్‌పోస్టర్లను జేఏసీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంబాడీల ఎస్టీ హోదాపై కొందరు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమ ఎస్టీ హోదాను కాపాడుకునేందుకు లంబాడీలంతా సంఘటితంగా పోరాడాల్సిన అవసరముందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వీరమ్మ, జేఏసీ నాయకులు గోపిసింగ్ నాయక్, సమ్మయ్య రాథోడ్, అజ్మీర వెంకట్ నాయక్, బానోత్ భాస్కర్ నాయక్, గుగులోత్ వీరమ్మ భాయి, ధరావత్ దేవేందర్ నాయక్, అంగోత్ సుధాకర్ నాయక్, లావుడియా రాజు నాయక్, అజ్మీర సునీత బాయి, తేజావత్ ఫణి కుమార్ నాయక్, భూక్య రమేష్ నాయక్ పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న హైమావతి

నయీంనగర్: నగరంలోని 6వ డివిజన్ లష్కర్ బజార్, మాస్ ఒకేషనల్ కళాశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ అడ్మిన్ హైమావతి మాట్లాడుతూ సఖి సెంటర్ ద్వారా బాధిత మహిళలకు ఉచిత కౌన్సిలింగ్, వైద్యం, న్యాయం, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు వివరించారు. సఖి సెంటర్ 24 గంటల పాటు పని చేస్తుందని, బాధితులు 181, 0870 2452112, 73829 83088 నంబర్లకు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. సదస్సులో సఖి కేస్‌వర్కర్ భారతి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్ శైలజ, సుమలత, స్పందన పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

24గంటల పాటు అందుబాటులో..

హసన్‌పర్తి: బాధిత మహిళలు సఖి సెంటర్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ సేవలందిస్తోందని లీగల్ అడ్వైజర్ శ్రీదేవి తెలిపారు. భీమారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సఖి సేవలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సఖి అందిస్తున్న ఐదు రకాల సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, విద్యార్థినులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అద్దె బస్సుల పార్కింగ్ స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

హన్మకొండ: అద్దె బస్సుల పార్కింగ్ కోసం స్థలాన్ని పోలీస్ అధికారులు, అద్దె బస్సుల యజమానులు పరిశీలించారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్, హనుమకొండ డిపో, వరంగల్-2 డిపో ప్రాంతాల్లో రోడ్డుకిరువైపులా ఆర్టీసీ అద్దె బస్సులు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరలో బతుకమ్మ, దసరా పండుగ రానుండడంతో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముండడంతో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బంది కల్గకుండా మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న కుడా స్థలాన్ని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రాంరెడ్డి, అద్దె బస్సుల యజమానులు, ట్రాఫిక్ ఎస్సైలు పరిశీలించారు. పార్కింగ్‌కు అనువుగా ఉంటుందని, ఈ అంశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ దృష్టికి తీసుకెళ్లి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు అనుమతి ఇవ్వాలని కోరతామని తెలిపారు. అద్దె బస్సుల యజమానులు కూడా మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించి అనుమతి కోరాలని ట్రాఫిక్ పోలీసులు అద్దె బస్సుల యజమానులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతిస్తే అద్దె బస్సుల సమస్యకు పరిష్కారం లభించనుంది.

వైద్య కళాశాలకు శరీర దానం


మృతదేహాన్ని సిబ్బందికి అప్పగిస్తున్న బాధ్యులు

ఎంజీఎం: ప్రశాంత్‌నగర్ సహృదయ ఆశ్రమం నివాసి ఉదయమ్మ (69) మంగళవారం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈమేరకు వైద్యవిద్య నిమిత్తం తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయమ్మ పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాల సిబ్బందికి ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబీ చోటేమియా అప్పగించారు. నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేయాలనుకున్న వారు 87905 48706, 94901 33650 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అనాటమీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం.పద్మ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కేదారి పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయ హుండీ ఆదాయం రూ.61 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. 55 రోజులకుగాను రూ.61,58,999 ఆదాయం లభించినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామల సునీత తెలిపారు. విదేశీ కరెన్సీ 316 యూఎస్ఏ డాలర్లు, 15 యూఏఈ దిరమ్స్, 70 కెనడా డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, ఇంగ్లాండ్ పౌండ్స్, 100 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమన్ లభించినట్లు తెలిపారు. పర్యవేక్షణాధికారిగా కురవి వీరభద్రస్వామి దేవస్థానం ఈఓ సత్యనారాయణ వ్యవహరించగా, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ శివసుబ్రహ్మణ్యం, భద్రకాళి శేషు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యారణ్యపురి: మాట్లాడుతున్న చంద్రమౌళి


మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న విద్యార్థినులు

విద్యారణ్యపురి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ప్రభుత్వ పింగిలి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి సూచించారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంలో కళాశాల కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రశాంతి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి

ఖిలా వరంగల్: వాతావరణంలో ఓజోన్ అనేది అత్యంత ప్రాధాన్యం గల పొర అని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనవాళిపై ఉందని ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ భగీరథ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ప్రేమలత సూచించారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ పరమేష్, అధ్యాపకులు పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, రమేష్, సుస్మిత, డాక్టర్ రాజన్న, సమీనా, గీత పాల్గొన్నారు.

నిట్‌లో వరల్డ్ ఓజోన్ డే

కాజీపేట అర్బన్: వరల్డ్ ఓజోన్ డే వేడుకలను నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో నిట్ వరంగల్, సీఆర్ఐఎఫ్ (సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ), అజిలెంట్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అక్షయ ల్యాబ్ టెక్స్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్, ప్రొఫెసర్లు రవికుమార్, సుధాకర్, సంజీవిని పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వల్ల ఏటా 10 లక్షల మరణాలు

హసన్‌పర్తి: ప్లాస్టిక్ వాడడం వల్ల దేశంలో ఏటా పది లక్షల మరణాలు సంభవిస్తున్నాయని సుజాత విద్యానికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు.